పొగాకు సాగుకే మొగ్గు

- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి
- ఎక్కువగా పొగాకుపై ఆసక్తి
- తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలే కారణం



ఆల్వకొండ గ్రామంలో ఎండబెట్టిన పొగాకు



సంజామల: వ్యవసాయంలో ప్రతి ఏటా దిగుబడులు రాక నష్టపోతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్నారు. సంజామల మండలంలో ఏటా మిర్చి, వరి, మినుము, మొక్కజొన్న, పత్తి, కంది వేసే రైతులు ఈ సారి రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపారు. సాగుకు అయ్యే ఖర్చు తక్కువగాను, దిగుబడి ఎక్కువగాను ఉండడంతో రైతులు ఈ పంటపైనే ఆసక్తి చూపుతున్నారు. మండలంలో దాదాపు అన్ని గ్రామాలో పొగాకు పంటను సాగు చేస్తున్నారు.

పెరిగిన పొగాకు సాగు విస్తీర్ణం..

గత సంవత్సరం మండలం వ్యాప్తంగా 50 ఎకరాల్లో సాగు చేస్తే ఈ ఏడాది ఏకంగా 420 ఎకరాలకు పెరిగింది. గతంలో వర్షాలు సకాలంలో అనుకులించి పొగాకు సాగులో మంచి దిగుబడి రావడంలో మార్కెట్‌లో ఆశించిన ధర లభించింది. దీంతో రైతుకు ఎకరానికి దాదాపు రూ.90 వేలు మిగిలింది. ఆదే ఆశతో ఈ ఏడాది ప్రత్యామ్నయ పంటగా పొగాకు వైపు రైతు ఆసక్తి చూపుతున్నాడు.

మిర్చి నష్టాలు మిగిల్చడంతో..

మిర్చి సాగుపై రైతులకు ఆశలు సన్నగిల్లాయి. మిర్చి పంటపై రూ.లక్షలు పెట్టుబడులు పెడితే వైరస్, తెగుళ్ల బారిన పడి పంట దిగుబడి తగ్గి రైతులు అప్పుల పాలవుతున్నారు. దీంతో మండలంలోని రైతులు మిర్చి సాగుపై ఆశలు వదులుకుని పొగాకు పైన ఆశలు పెట్టుకున్నారు. ఎకరాకు పొగాకు 8-12 క్వింటాళ్ల దిగుబడివస్తుంది. మార్కెట్ సరాసరి క్వింటా రూ.15 వేలు పలికినా దాదాపు ఖర్చులు పోను దాదాపు రూ.లక్ష మిగిలే అవకాశాలు మిండుగా ఉన్నాయని రైతు అంచాన వేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు

రైతు వేసిన పంటే వేయకుండా పంట మార్పిడి చేయడం ద్వారా దిగుబడి అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. మండలంలో మిర్చి సాగును తగ్గించి రైతులు పొగాకు వైపు చూస్తున్నారు. గతంలో 50 ఎకరాలు సాగు చేశారు. ఈ ఏడాది 420 ఎకరాల్లో వేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి రేటు పలుకుతోంది. రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసి అధిక దిగుబడి సాధించాలి.

–సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

తరగతి గదుల ప్రారంభం



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని తెలుగుపేట కాలనీ ఎంపీపీ పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను రాష్ట రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో కిచెన్ షెడ్డు, డైనింగ్‌హాల్‌తో పాటు తాగునీటి సమస్య ఉందని పాఠశాల ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో డీఈఓ జనార్దన్‌రెడ్డి, ఏఎంఓ లలితాకుమారి, ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు, హెచ్‌ఎం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీడీ నరసింహారెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీడీ నరసింహారెడ్డి బుధవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. సమయపాలన పాటించి, కొలతల ప్రకారం పనిచేయడం ద్వారా రోజువారీ వేతనం రూ.300 అందేలా చూడాలన్నారు. మస్టర్లలో ఒకరికి బదులు మరొకరు పనికి రావొద్దన్నారు. గ్రామాల్లో మంజూరైన పశువుల షెడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఏపీఓ శేషన్న, ఈసీలు సుబ్బానాయక్, శంకర్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామక్రిష్ణాపురం గ్రామంలో అదనపు కట్నం కోసం వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన కె ఉప్పరి లక్ష్మణ స్వామి కుమార్తె మౌనికను 18 నెలల క్రితం ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం మిట్టమిద పల్లి గ్రామానికి చెందిన గిద్దలూరు నారాయణతో వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నంగా రూ.3లక్షలతో పాటు ఆరు తులాల బంగారు ఇచ్చారు. అయినా అదనపు కట్నంగా మరో రూ.2లక్షలు తీసుకురావాలని భర్త నారాయణ, అత్త చంద్రావతి మానసికంగా, శారీరకంగా హింసించేవారు. బాధను భరించలేక మౌనిక పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్త నారాయణ, మామ నడిపి రామయ్య, అత్త చంద్రావతిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.


వరి, మామిడికి బీమా చేయించుకోవాలి



సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

బేతంచెర్ల: రబీ సీజన్‌లో సాగుచేసిన వరి, మామిడి పంటలకు బీమా గడువు ఈ నెల 31వ తేదీ వరకు ఉందని ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం బేతంచెర్ల పట్టణం సమీపంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనగ పంటను పరిశీలించి, సస్యరక్షణ పద్ధతులపై సలహాలు ఇచ్చారు. వరికి ఎకరానికి రూ.126, మామిడికి ఎకరానికి రూ.2250 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఏఈఓలు మధు, మహమ్మద్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు కల్యాణి, షజియా పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న బొలెరో



ఘటనా స్థలంలో రోడ్డుపై పడిపోయిన టమాటాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని అబ్బిరెడ్డిపల్లి చెరువు వద్ద బుధవారం ఎడ్ల బండిని బొలెరో వాహనం ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. వెంకటాపురం గ్రామం నుంచి చెరువు వద్దకు వస్తున్న ఎద్దుల బండిని వెనుక నుంచి టమాటా లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఎడ్ల బండిని బొలెరో క్రాస్ చేసి వెళ్లే ప్రయత్నంలో ప్రమాదం చోటు చేసుకుంది. బొలెరోలోని టమాటలన్నీ రోడ్డుపై పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాలేదన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన

బేతంచెర్ల: మారుతున్న కాలనుగుణంగా విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగిఉండాలని డోన్ తాలుకా, బేతంచెర్ల మండల వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు నాగరాజు, రవికుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోరుమానుకొండ మోడల్ స్కూల్లో జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు 2019 రక్షణ చట్టం గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మరియదాసు, ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య ఆధ్వర్యంలో డ్రైవర్లు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. సుబ్బయ్య మాట్లాడుతూ పోలీసుల కఠిన నిబంధన వల్ల డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారని,కుటుంబాలు నడవడం ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తగిరి,మనోహర్,గోపాల్,నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్: రవాణా కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, డోన్ లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం డిమాండ్ చేశారు. గత రెండు రోజుల్లో గుండెపోటుతో మృతి చెందిన ఇద్దరు లారీ డ్రైవర్లు గిరిబాబు (45), రామాంజనేయులు (46) భౌతిక కాయాలను బుధవారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నంద్యాల నుంచి లోడు లారీతో చిత్తూరుకు వెళ్లిన గిరిబాబు మంగళవారం అక్కడ లారీలో నిద్రిస్తూ గుండెపోటుతో మరణించారని, గోసానిపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయులు తాడిపత్రి సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీలో లోడ్ కోసం వేచి ఉండగా చాతి నొప్పితో ఇబ్బంది పడుతుండడంతో తోటి డ్రైవర్లు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేషనల్ పర్మిట్ కలిగిన వాహనాలకు డబుల్ డ్రైవర్లతో పాటు ఒక క్లీనర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా లారీ యజమానులు కనీసం క్లీనర్‌ను కూడా ఏర్పాటు చేయకుండా ఒక్క డ్రైవర్‌ను మాత్రమే పంపుతున్నారని ఆరోపించారు. రెండు ఘటనల్లోనూ లారీలకు క్లీనర్ లేకపోవడంతో డ్రైవర్లు దిక్కులేని వారిగా తనువు చాలించారని ఆవేదన వ్యక్తం చేశారు. క్లీనర్లు వెంట ఉండింటే సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లేవారని, ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడే అవకాశాలు ఉండేవన్నారు. ప్రభుత్వం స్పందించి రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఆర్‌సీ రెడ్డి, రంగడు, ఆదినారాయణ, ఎర్రన్న, రాము, నాగరాజు, శ్రీనివాసులు, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



కర్నూలులో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేంద్రరెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరైన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

రెవెన్యూ సదస్సుకు 18 దరఖాస్తులు



ముద్దవరంలో తహసీల్దార్ ప్రకాశ్‌బాబుకు అర్జీలను అందజేస్తున్న రైతులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామ సచివాలయం ఆవరణలో తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, సర్పంచ్ తిమ్మయ్య ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి చేర్పులు, మార్పులకు సంబంధించి 9, సర్వేకు సంబంధించి 6 దరఖాస్తులు, బేతంచెర్లకు సంబంధించి రెవెన్యూ రికార్డుల దరఖాస్తులు 3 వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

సారా తయారీ చట్టరీత్యా నేరం



సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న అధికారులు

అవుకు: నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మినా, నిల్వ ఉంచినా చట్ట రీత్యా నేరమని బనగానపల్లె ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనా దేవి అన్నారు. బుధవారం అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు చేశారు. ఆమె మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు అవుకు మండలం గడ్డమేకులపల్లె గ్రామంలోని కొండ ప్రాంతంలో దాడులు చేసి సారా బట్టీని ధ్వంసం చేసి, వెయ్యి లీటర్ల బెల్లంఊటను పారబోశామన్నారు. అలాగే బెలుం గ్రామంలో సారా అమ్ముతున్న దూదేకుల దస్తగిరిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద ఉన్న 10 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. దాడుల్లో కోవెలకుంట్ల సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ నాయక్, ఎస్‌ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు స్పందన కరువు

బనగానపల్లె రూరల్ : మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలో బుధవారం తహసీల్దార్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలకు స్పందన కరువైంది. ఇందులో కేవలం మూడు దరఖాస్తులే భూ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వీటిని పరిశీలించి తగిన న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గీతాభవాని, గ్రామ సర్వేయర్లు మధు, తనుజా తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు నూతన ప్రిన్సిపాల్‌గా కేశిరాజు శ్రీనివాస్ నియమితులయ్యారు. గతంలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జాస్మిన్ కొద్ది నెలల క్రితం పదవీ విరమణ పొందడంతో ఆమె స్థానంలో విజయవాడలోని రాష్ట విద్యా శాఖలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఈ నెల 9వ తేదీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు బుధవారం డోన్‌కు వచ్చిన ఆయన పదవీ బాధ్యతలు చేపట్టి స్కూల్లో ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ చంద్రకాంత్, తోటి ఉపాధ్యాయులను కలిశారు.


విద్యుత్ కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



ఐక్యత తెలుపుతున్న నూతన కార్యవర్గ సభ్యులు

డోన్ టౌన్: విద్యుత్ రంగ కార్మికుల సమస్యలపై తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఆ సంఘం రాష్ట వర్కింగ్ ప్రసిడెంట్ నాగన్న, డోన్ డివిజన్ నూతన అధ్యక్షుడు రవీంద్ర వరప్రసాద్ అన్నారు. డోన్ ఇండస్ట్రియల్ సబ్‌స్టేషన్‌లో బుధవారం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నాగన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా డోన్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రవీంద్ర వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా వెంకట్రాముడు, కార్యదర్శిగా నాగచంద్రుడు, సహాయ కార్యదర్శిగా మధు, కోశాధికారిగా రంగస్వామిని ఎన్నుకున్నారు. సిబ్బంది గోవిందనాయక్, బ్రహ్మానందరెడ్డి, చంద్రతో పాటు కార్మికులు, షిఫ్ట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ వరప్రసాదరావు

కోవెలకుంట్ల: ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వరప్రసాదరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజి, తదితర సమస్యలపై దృష్టి సారించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

బనగానపల్లె రూరల్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి జరగాలంటే సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్‌రెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



గోవింద నామస్మరణ చేస్తున్న మహిళా భక్తులు

డోన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే ధనుర్మాస వేడుకల్లో మూడవ రోజు గోదాదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో గోవింద మాలాధారులతో పాటు మహిళా భక్తులు గోదాదేవిని విశేషంగా అలంకరించి పూలమాలలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది.

బాల్ బ్యాడ్మింటన్ ప్రాక్టీస్‌కు ఏర్పాట్లు

డోన్: జనవరి మొదటి వారంలో ముంబైలో జరగనున్న నేషనల్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే రాష్ట క్రీడాకారిణుల జట్టు ప్రాక్టీసు చేసేందుకు నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో ప్రత్యేక క్యాంప్ సిద్ధమైంది. ఇప్పటికే ఈ జట్టుకు ఎంపికైన పలు జిల్లాలకు చెందిన క్రీడాకారిణులు డోన్ చేరుకున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి జట్టు సభ్యులందరికీ జాతీయ క్రీడాకారులతో ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారుడు కేఈ మౌళా తెలిపారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆర్థిక సహాయంతో 10 రోజుల పాటు కోచింగ్ క్యాంపులో పాల్గొనే క్రీడాకారిణులందరికీ ఉచిత వసతి, భోజన ఏర్పాట్లు చేశామన్నారు. రేపు, ఎల్లుండి మరికొంత మంది క్రీడాకారిణులు రానున్నారని ఆయన వెల్లడించారు.

ఆగని స్టార్టర్ బాక్స్‌ల చోరీలు

డోన్ టౌన్: మండల పరిధిలోని బొంతిరాళ్ల గ్రామంలో వరుసగా విద్యుత్ మోటర్ స్టార్టర్ బాక్స్‌ల చోరీలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత కొద్ది నెలల క్రితం ఈ గ్రామంలో రిటైర్డు న్యాయమూర్తి పొలంలో, మరికొంత మంది రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్లకు అమర్చిన స్టార్టర్ బాక్స్‌లు చోరీకి గురైన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన హరిజన శంకర్ అనే దళిత రైతుకు చెందిన పొలంలో స్టార్టర్ బాక్స్‌తో పాటు మోటార్‌కు అమర్చిన విద్యుత్ వైర్ చోరీకి గురైనట్లు బాధితుడు బుధవారం తెలిపారు. పోలీసులు స్పందించి వ్యవసాయ పరికరాలను దొంగలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం



నూతన బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే సంస్థ ధ్యేయం అని ఆ శాఖ నంద్యాల ఎస్‌ఈ సుధాకర్ అన్నారు. మండలంలోని కొచ్చెర్వు సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను ఆయన బుధవారం ప్రారంభిచారు. అనంతరం గ్రామ రైతులతో సమావేశమై విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొచ్చెర్వు సబ్ స్టేషన్‌కు ప్రత్యేకంగా బ్రేకర్ ఏర్పాటు చెయ్యడం వల్ల గ్రామానికి 24 గంటలు విద్యుత్ సరఫరా ఉంటుందని, ఏవైన విద్యుత్ సమస్యలు తలెత్తితే స్థానిక సిబ్బందికి లేదా ఏఈ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈలు నాగేంద్ర, గురులింగాచారి, ఏఈ నాగేశ్వరరెడ్డి, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు

బేతంచెర్ల: స్థానిక సంద్యాల రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మార్గశిర మాసం పురస్కరించుకొని బుధవారం రాత్రి విశేష పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, రక్షాబంధన, కలశ స్థాపన, దీక్షా హోమం, గణపతి, నవగ్రహ, రుద్రహోమములు, మూల మంత్ర హోమం, పూర్ణాహుతితో పాటు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి దేశ్పాండే గురుస్వామి, బ్రహ్మశ్రీ హరి నారాయణ గురుస్వామి మాలధారులు, భక్తజనసందోహం మధ్య ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, మూల విరాట్‌కు విశేష అలంకరణ చేసి, భజనలు, సంకీర్తనలతో విశేష పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులచే 'స్వామి యే అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప' శరణుఘోషతో హరి హరసుతుడు శబరిమల నుంచి బేతంచెర్లకు వచ్చి భక్తుల మొర ఆలకిస్తున్నాడా అన్నట్లుగా ఆధ్యాత్మిక శోభ కనిపించింది. అయ్యప్ప సేవా సమితి సభ్యులు బచ్చు సుబ్రమణ్యం, మల్లు హుసేన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు ప్రదీప్

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రం పుష్యమిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక హోమాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి.

నేడు రైల్వే పెన్షనర్ల సంఘ సమావేశం

డోన్ టౌన్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని మర్రి రాఘవయ్య భవన్‌లో గురువారం ఉదయం 10 గంటల నుంచి రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఈ సంఘం జోనల్ ఉపాధక్షుడు, డోన్ బ్రాంచ్ కార్యదర్శి ఏ.రంగస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ కార్యదర్శి ఎస్ఎస్‌సీ రామకృష్ణామాచార్యులుతో పాటు పలువురు నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణతో పాటు 73 సంవత్సరాల వయస్సు పైబడిన వారిని ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి నిరూపించుకోవాలి



మాట్లాడుతున్న ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న

బేతంచెర్ల: వాల్మీకులపై సీఎం చంద్రబాబునాయుడుకు ప్రేమ ఉంటే ఎస్టీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (ఎంవీఆర్పీఎస్) రాష్ట అధ్యక్షుడు బోయ పులికొండన్న అన్నారు. బుధవారం బేతంచెర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగడానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. కేంద్రంలో ఉన్న మైత్రితో సీఎం చంద్రబాబు వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనకు కృషి చేస్తే వాల్మీకి సోదరులందరూ అండగా ఉంటారని స్పష్టం చేశారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని పార్లమెంట్‌లో మాట్లాడిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఆర్పీఎస్ రాష్ట ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, పాణ్యం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు బ్రహ్మనాయుడు, మురళీకృష్ణ, సత్యాలు, నిరంజన్, మల్లికార్జున, రమేష్, భార్గవ్, అమర్, చంద్ర పాల్గొన్నారు.

అల్లుడిపై మామ దాడి

బేతంచెర్ల: పట్టణంలోని గురవయ్య పెట్రోలు బంక్ సమీపాన గోరుమానుకొండ గ్రామానికి చెందిన సోమ్లానాయక్‌పై మామ దోసునాయక్, బావమరిది శ్రీకాంత్ నాయక్ కట్టెలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు సోమ్లానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.